

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఇంటికి వెళ్ళాక** ఎందుకో ఈ మెయిల్స్ చూడాలనిపించింది. సాధారణంగా నాకు అడ్వర్టైజ్‌మెంట్లు తప్ప వేరే ఈ మెయిల్స్ రావు. కానీ ఎందుకో లాప్‌టాప్ ఆన్ చేసి లాగిన్ అయ్యాను. నేను పంపిన ఈ మెయిల్‌కి ఒక ప్రొఫెసర్ రిప్లై ఇచ్చారు. ఆయన ఆఫీసుకి రేపు ఉదయం పదకొండున్నరకి రమ్మన్నారు.

ఆనందంతో మొహం పొంగిపోయింది. వెంటనే అన్నయ్యకి ఫోన్ చేసాను.

"ఏమైందో తెలుసా?" అడిగాను.

"ఏమైంది"

"నాకు ప్రొఫెసర్ నుంచి ఈ మెయిల్ వచ్చింది"

"ఏమని?"

"ఆన్ కాంపస్ జాబ్ కావాలి అని అడిగితే రేపు వచ్చి కలవమన్నారు."

"గుడ్. ఏ సబ్జెక్ట్ చెప్తారు?"

"తెలీదు"

"తన రీసెర్చ్ ఏ ఏరియాలో"

"తెలీదు"

"తెలుసుకో అన్నీ, ఏం సబ్జెక్ట్స్ చెప్తారు? రీసెర్చ్ ఏ ఫీల్డ్‌లో, ఆయన రాసిన పేపర్లు, అన్నీ చూసుకుని వెళ్ళు. ఆయన అడిగినప్పుడు ఆ ఏరియాలో ఇన్‌ట్రెస్ట్ ఉందని చెప్పు. ఆయన దగ్గర పని చేసే వాళ్ళు, లేదా ఆయన క్లాసులు తీసుకున్న వాళ్ళతో మాట్లాడి ఆయన ఎలాంటి వాళ్ళో కనుక్కో."

"సరే. నా రూం మేట్‌ని అడుగుతా. పేపర్లు ఎక్కడ చూడాలి?"

"యూనివర్సిటీ వెబ్ సైట్‌లో ఉంటాయి. ఆయన డీటెయిల్స్‌లో చూడు. పబ్లిష్ అయిన పేపర్లలో ఏదో ఒకదాని గురించి జనరల్ సెర్చ్ చెయ్యి."

"సరే. అంతే చేస్తా"

"రాత్రి నైట్ అవుట్ చెయ్యి. పొద్దున్నే లేచి నీట్‌గా రెడీ అవ్వు. ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్. బాగా మాట్లాడు."

"సరే. నేను చదువుకుంటాను ఇంక"

"ఆల్ ద బెస్ట్"

ఫోన్ పెట్టి వెబ్‌సైట్‌లో ఆయన గురించి చూసాను. యేల్ యూనివర్సిటీలో పి.హెచ్.డి ఇన్ ఏరో డైనమిక్స్ చేసారు. నాసాకి కూడా పని చేసారు. సెస్నా నుండి రిసెర్చ్ గ్రాంట్ వచ్చిందని స్పష్టంగా ఉంది. బహుశా వెన్నెలకి తెలుసేమో. ఆయన రాసిన పేపర్లు కొన్ని డౌన్‌లోడ్ చేసాను. కానీ ఒక్క ముక్క అర్థం కాలేదు. హైపర్ సానిక్ డైనమిక్స్ మీద ఎక్కువ రిసర్చ్ చేసారాయన. హైపర్ సానికి డైనమిక్స్‌ని గూగుల్ చేసి కొంత చూసాను. హనీషకి తెలిసినవాళ్ళు ఈయన దగ్గర పని చేసారా అని అడిగాను.

"మీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసరా? " అడిగింది.

"ఔను"

"తెలీదే. ఎప్పుడూ పేరు వినలేదు"

నిరాశపడ్డాను.

"అడిగి చూస్తాను ఎవరికైనా తెలుసేమో"

కొంతసేపు తను మెసేజీలు కొట్టింది.

"డైరెక్ట్‌గా తెలుసు, లేదా తెలీదు అని చెప్పకుండా 'ఎందుకు, ఎవరికి' లాంటి ప్రశ్నలు అడిగితే ఎంత చిరాకేస్తుందో" అంది.

"నాక్కూడా" టెన్షన్‌తో అన్నాను.

"భయపడకు. అంతా సెట్ అవుతుందిలే" అంది.

కొంత సేపు తను మేసేజ్‌లు కొట్టింది.

కొద్దిసేపటి తరవాత, "అభిషేక్ అని ఒకతను ఉన్నాడట. నేను ఇంటికి రమ్మంటా. మీరు మాట్లాడుకుంటారా?"

"యా, ఓకే. రమ్మను. థాంక్స్"

"ఇప్పుడు వస్తే ఓకేనా? ఆఫ్ కాంపస్ జాబ్‌కి ఒక హాఫెనవర్‌లో వెళ్తాడట."

"యా. ఓకే.నో ప్రాబ్లమ్"

"చాలా థాంక్స్."

"థాంక్స్ అక్కర్లేదులే. జాబ్ వస్తే పార్టీ ఇవ్వు. చాలు"

"తప్పకుండా"

రెండు నిమిషాల్లోనే అభిషేక్ వచ్చాడు.

"హాయ్ హనీష"

"హాయ్ అభిషేక్ నువ్వు మా వెనకాల ఇంట్లోనే ఉంటావు కదా?"

"ఔను"

"ఎప్పుడూ చూస్తాను కానీ పేరు తెలీదు"

"యా. సందీప్ నా రూమ్మేట్"

"చెప్పాడు. ఇందాక మెసేజ్ చేస్తే. నువ్వు ఏరో స్పేస్ అని తెలీదు నాకు"

"యా. చాలా తక్కువ మంది ఇండియన్స్ ఉన్నారు ఏరో స్పేస్‌లో. నువ్వు ఎలెక్ట్రికల్ అనుకున్నాను. ఏరోస్పేసా?"

"అంత టాలెంట్ లేదు లే. నా రూమేట్ అవని ఏరో స్పేస్. తనకి రేపు మీ ప్రొఫెసర్‌తో ఇంటర్వ్యూ ఉంది."

"ఎప్పుడొచ్చావ్?" నన్ను చూసి అడిగాడు.

"ఆల్మోస్ట్ వన్ వీక్ అవుతుంది."

"యూనివర్శిటీకి కొత్తా?" నవ్వుతూ అడిగాడు.

"ఔను. ఇదే ఫస్ట్ సెమిస్టర్."

"ఫస్ట్ సెమిస్టర్‌లోనే జాబ్ ఇస్తానన్నాడా?" ఆశ్చర్యపోయాడు.

"లేదు. ఈ మెయిల్ చేస్తే రేపు వచ్చి కలవమన్నారు. అంతే"

"ఓహో. వెరీనైస్"

రెండు నిమిషాల నిశబ్దం తరవాత, "తాగడానికి ఏమైనా కావాలా?" హనీష అడిగింది.

"అహా. ఏమీ ఒద్దు. నాకు జాబ్‌కి టైం అవుతుంది" అన్నాడు.

వెంటనే గబుక్కున "ఎలాంటి ప్రశ్నలు అడుగుతాడు? తన రీసర్చ్ అంతా హైపర్ సానిక్‌లో ఉంది. నాకు కొంచెం ఫాస్ట్ గా వన్ టు మినిట్స్‌లో ఎక్స్‌ప్లెయిన్ చేస్తావా?" అడిగాను.

"అది అర్థం చేసుకోడానికి చాలా టైం పడుతుంది. ఎక్స్‌ప్లెయిన్ చెయ్యడం కూడా కష్టమే. తన రీసెర్చ్ చదివావా?"

"చదివాను కానీ ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు"

ఇద్దరూ నవ్వారు.

"మేము ఇప్పుడు చేసేది ఫ్లైట్ డైనమిక్స్‌లో రీసెర్చ్. ఫ్యూయల్ ఎఫీషియన్సీని పెంచడానికి రీసెర్చ్ చేస్తున్నాము. దాంట్లో చాలా ఆస్పెక్ట్స్ ఉంటాయ్. వాడే మెటీరియల్, ఇంజన్ గ్రేడ్, ఫ్యూయల్ గ్రేడ్‌లో రీసెర్చ్. దానికి సెక్యూరిటీ క్లియరెన్స్ రావాలి. నీకు అందులో ఇవ్వకపోవచ్చు. మోస్ట్లీ మెటీరియల్ లేదా ఫ్లైట్ స్టాటిస్టిక్స్ సైడ్ ఇవ్వచ్చు. నేను నీకు కొన్ని పేపర్స్ పంపుతా. అవి చదువుకుని వెళ్ళు. ఏం టైం కి రమ్మన్నాడు?"

"11.30కి"

"ఓకే. చాలా టైం ఉందిలే. రేపు పొద్దున నేను ఆయన్ని కలిసి నీ గురించి మంచిగా చెప్తా"

"థాంక్ యు సో మచ్. కానీ ఆ పేపర్స్ కొంచెం తొందరగా పంపరా"

"యా..యా.. జాబ్‌కి వెళ్ళగానే పంపిస్తాను" నవ్వాడు.

"థాంక్యూ"

"టెన్షన్ పడకు. ఆయన పిచ్చ లైట్. కొత్త ప్రొఫెసర్ ప్లస్ మొన్నే గ్రాంట్ అప్రూవ్ అయ్యింది. ఆయన దగ్గర చాలా రీసెర్చ్ పని ఉంది."

"ఓ. ఓకే"

"ప్లస్ ఆయన దగ్గర రీసెర్చ్ చేస్తే ఆయన నీకు అడ్వైజర్. అప్పుడు విట్‌మన్‌కి నీకు సంబంధం ఉండదు విట్‌మన్‌ని కలపాలా?"

"లేదు. తన గురించి విన్నాను."

"కలవకు. రేపు ఈయన నీకు జాబ్ ఇస్తే ఒక గోల వదిలిపోతుంది."

"ఓకే."

"సరే. నేను వెళ్తానింక. ఏమైనా డౌట్స్ ఉంటే కాల్ చెయ్యి. సందీప్ దగ్గర నుండి నా నంబర్ తీసుకో"

"సరైతే. థాంక్స్ ఎలాట్."

తను వెళ్ళినప్పటినుంచి నాకు పేపర్స్ ఈ మెయిల్ చేసేంత వరకు కాలుకాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగాను.

ఆ తరువాత తిండి, తిప్పలేకుండా ఆ పేపర్లను చదివి, అర్ధంకాని వాటి గురించి గూగుల్ సెర్చ్ చేస్తూ రాత్రంతా గడిపాను.

నిద్రపోయి ఉంటే కలలో ఖచ్చితంగా విమానాలే వచ్చేవి కాబోలు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story